క్లుప్తంగా

పాఠశాలల్లో ఉత్సాహంగా ఆటల పోటీలు



కె.జె.పురం హైస్కూల్లో షటిల్ ఆడుతున్న విద్యార్థులు

మాడుగుల రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. మాడుగుల బాలుర, బాలికల హైస్కూళ్లు, కింతలి, ఒమ్మలి, వీరనారాయణం, కె.జె.పురం, జి.అగ్రహారం, ఎం.కోడూరు, గాదిరాయి హైస్కూళ్లతోపాటు ఎంపీపీ, యూపీ స్కూళ్లలో బాలబాలికలు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొంటున్నారు. మంగళవారం వాలీబాల్, షటిల్, ఖోఖో, క్రికెట్, కబడ్డీ, స్కిప్పింగ్ తదితర ఆటలు ఆడారు. పాఠశాల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల సారథ్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో విజేతలకు స్వాతంత్ర్య దినోత్సవాన బహుమతులు ప్రదానం చేయనున్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

మాడుగుల రూరల్: స్థానిక మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ టీవీ రాజారామ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ప్రతి ఇంటికి కుళాయి నీరు

దేవరాపల్లి: జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా మేజర్ పంచాయతీ దేవరాపల్లిలో ప్రతి ఇంటికీ కుళాయి నీరు సరఫరా చేయడమే లక్ష్యంగా పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ కె.చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. పంచాయతీ పరిధిలో 9,377 మంది జనాభా, 2,514 ఇళ్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం నిబంధనల మేరకే పైప్‌లైన్ పనులు చేపడుతున్నామని, వీటి కోసం జరిపిన సీసీ రోడ్డు తవ్వకాల్లో పెచ్చుల్ని ట్రాక్టర్‌తో తీయిస్తున్నట్లు పేర్కొన్నారు. పనులు పూర్తి కాగానే తవ్విన రోడ్లకు మరమ్మతులు చేపడతామని వెల్లడించారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన



ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యం స్టాల్‌ను సందర్శిస్తున్న రైతులు

రోలుగుంట: ప్రకృతి వ్యవసాయం, పంట దిగుబడిపై ఆ శాఖ మండల ఇన్‌చార్జి నిర్మలా కుమారి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సిబ్బందితో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి సేద్యంలో పండించిన కూరగాయల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్టాల్ వద్దకు వచ్చిన రైతులకు, సందర్శకులకు ప్రకృతి సేద్యం గురించి వివరించారు. కార్యక్రమంలో ఆ శాఖ ఎల్‌ఐ మోదినాయుడు, గ్రామస్థాయి కార్యకర్తలు వై.గంగాభవాని, కె.నాగకాంతం, రాము, రమణ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



రవీంద్రనాథ్ దంపతులను సత్కరిస్తున్న డీసీవో రూపావతి

దేవరాపల్లి: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు, ఉద్యోగ విరమణ తర్వాత కూడా సమాజంలో గుర్తింపు ఉంటుందని ఉమ్మడి విశాఖ గురుకుల విద్యాలయాల కోఆర్డినేటర్ ఎస్.రూపావతి అన్నారు. తెనుగుపూడిలోని డా బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల విద్యాలయ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సీహెచ్ రవీంద్రనాథ్ పదవీ విరమణ సన్మాన సభ మంగళవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి హాజరైన డీసీవో సహా పలువురు గురుకుల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, పూర్వ ఉపాధ్యాయులు ఆయన సేవల్ని కొనియాడారు. అనంతరం రవీంద్రనాథ్, సత్యవతి దంపతులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.పడాల్‌దాస్, వి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట: ఎల్‌బీ పురంలో ఎండలకు వడలిపోతున్న వరి ఆకుమడి



మాడుగుల రూరల్: ఎండ తీవ్రతకు వీవీ అగ్రహారంలో ఎండిన వరినాట్లు

ఆశలు ఆ'వరి'

- వర్షాల్లేక ఎండుతున్న వరి నాట్లు
- ఆకుమడుల రక్షణకు రైతుల అగచాట్లు



బుచ్చెయ్యపేట: గొన్నవానిపాలెం వద్ద చెరువులో అడుగంటిన నీరు



బుచ్చెయ్యపేట: దిబ్బిడిలో ఎండిపోతున్న ఆకుమడికి మోటారు సాయంతో నీరు అందిస్తున్న రైతు

మాడుగుల రూరల్/బుచ్చెయ్యపేట: వర్షాభావ పరిస్థితులు వరి నారుమడి, నాట్లకు సంకటంగా మారాయి. మాడుగుల, బుచ్చెయ్యపేట మండలాల్లో సాగునీటి ఎద్దడికి రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెల్లో కురిసిన వర్షాలకు ఆనందంగా దమ్ములుపట్టి, నాట్లు వేసిన చోట కూడా ప్రస్తుతం పొలాలు బీటలు వారాయి. అవకాశమున్న చోట డీజిల్ ఇంజిన్ల సాయంతో నీటిని తోడి, నాట్లు, నారుమడులకు తడులు పెడుతున్నారు. పలు చోట్ల సరిపడా నీరు లేక దమ్ములు పట్టలేదు. దీంతో నారుమడులు ముదిరి, పనికిరాకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవిని తలపించేలా ఎండలు

ఆగస్టు నెల్లో ఇంతటి వర్షాభావ పరిస్థితుల్ని ఈ మధ్య కాలంలో చూడలేదని రైతుల మాట. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవాల్సిన సమయంలో వేసవిని తలపించేలా ఎండలు మండిపోతున్నాయి. దీంతో ఇటీవల వేసిన వరినాట్లు నీరులేక ఎండిపోతున్నాయి. గత నెల్లో అడపా దడపా కురిసిన వర్షాలకు జలాశయం ఆయకట్టు దిగువన భూముల్లో వరి నాట్లు వేశారు. ఆ ప్రాంతాల్లో ఎండ ల తీవ్రతకు నాట్లు మాడిపోతున్నాయి. మెట్ట భూముల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆకుమడులు దక్కేలా లేవన్న భయంలో రైతులున్నారు.

ఎర్రవాయి రైతుల అవస్థలు

బుచ్చెయ్యపేట మండంలోని ఎర్రవాయి ప్రాంత గ్రామాల్లో వరి ఆకుమడులు ఎండల ధాటికి చుట్టుకుపోతున్నాయి. పక్షం రోజులుగా చిటుకుమని చుక్క వర్షం లేదు. దీంతో బుచ్చెయ్యపేట, దిబ్బిడి, రాజాం, పెదమదీన, కందిపూడి, ఆర్.భీమవరం, మల్లాం, శివరాంపురం, తైపురం, తురకలపూడి తదితర గ్రామాల్లో రైతులు వేసిన ఆకు మడులు వడలిపోతున్నాయి. వీటిని రక్షించుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఆకుమడులు లేకపోతే వరి నాట్లు వేసేదెలా అంటూ రైతులు వాపోతున్నారు.

5 వేల ఎకరాల్లో సాగు సందిగ్ధం

కనీసం తిండి గింజలైనా పండించుకోవాలన్న ఆశతో చాలా మంది రైతులు డీజిల్ ఇంజిన్లు, మోటార్ల ద్వారా నీటిని తోడి ఆకుమడుల్ని సంరక్షించుకునే పనిలోపడ్డారు. వారం పది రోజుల్లో వర్షాలు కురవకపోతే ఈ రెండు మండలాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో సాగుకు అవకాశం లేనట్లే. ఖరీఫ్ సీజన్ వచ్చి మూడు నెలలవుతున్నా ఈ పరిస్థితే కొనసాగడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా ప్రాంతాల్లో చెరువుల్లోని నీరు కూడా అడుగంటిపోయింది. వరుణుడి కరుణపైనే ఆశలు పెట్టుకున్నారు.

బొత్సకు అభినందనలు





ఉమ్మడి విశాఖ ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నిక కానున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను మంగళవారం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్, సినీ నటుడు ఎల్.జోగినాయుడు విశాఖలో కలిసి పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. కూటమి పార్టీ ఈ ఎన్నికల నుంచి తప్పుకోవడంతో బొత్స ఎన్నిక లాంఛన ప్రాయమే కానుంది. - నర్సీపట్నం/నాతవరం

ఈ-పంట నమోదుతో రైతులకు మేలు



పంట నమోదును పరిశీలిస్తున్న ఏవో సోమశేఖర్



ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏవో రమాదేవి

కె.కోటపాడు: ఈ-పంట నమోదుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని మండల వ్యవసాయాధికారి పి.సోమశేఖర్ అన్నారు. మండలంలోని గొండుపాలెంలో వ్యవసాయశాఖ, రెవెన్యూశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-పంటలో వరి, చెరకు, సరుగుడు, మామిడి, జీడి, కూరగాయలు, పూలు, పండ్ల సాగు వివరాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 15 వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రకృతి విపత్తులు ఎదురయ్యే సమయాల్లో ఈ-పంటలో నమోదైన రైతులకు నష్టపరిహారం అందుతుందన్నారు. గత ఏడాది మండలంలో 9,800 మంది రైతులు 10,500 ఎకరాల్లో వేసిన పంటలను ఈ-పంట విధానంలో నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి మధు, వ్యవసాయశాఖ సహాయకుడు సుధీర్ పాల్గొన్నారు.

చీడికాడ: ప్రతి రైతు ఈ-పంటలో తమ సాగు వివరాలను నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి ఏవో రమాదేవి కోరారు. మంగళవారం ఆమె పలు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 13 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ-క్రాప్ నమోదు ప్రారంభమైందన్నారు. పంట వేసిన ప్రతి రైతు, కౌలు రైతులు ఆయా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకుల వద్ద వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

ఎస్సీ హాస్టల్ సమస్యలపై విద్యార్థుల ఆందోళన



చోడవరం ఎమ్మెల్యే రాజుకి వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌వో నాయకులు

చోడవరం : ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరుతూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో) డిమాండ్ చేసింది. ఈ మేరకు పీడీఎస్‌వో ఆధ్వర్యంలో విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ చోడవరం ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్లో కనీస సదుపాయలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మరుగుదొడ్లు సరిగా లేవని, హాస్టల్ భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి, ఎప్పుడు కూలిపోతుందో తెలిదన్నారు. నియోజకవర్గం మొత్తానికి ఒక్కటే కాలేజీ హాస్టల్ ఉందని, అది కూడా కనీస వసతుల్లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారని ఆక్షేపించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లి అక్కడ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజుకి వినతిపత్రం అందించారు. సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆందోళనలో పీడీఎస్‌వో ప్రతినిధులు ఎ.మౌనిక, అఖిల్, చంటి, రామ్‌చరణ్, రామకృష్ణ, పి.వంశీ పాల్గొన్నారు.

వీరనారాయణంలో 104 వైద్య సేవలు

మాడుగుల: మండలంలోని వీరనారాయణం గ్రామంలో మంగళవారం 104 ద్వారా వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా దీర్ఘకాలిక రోగులతో పాటు వైరల్ జ్వరాలతో బాధపడుతున్న 170 మందిని గుర్తించి అవసరమైన మందుల్ని ఉచితంగా ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసాద్‌పాత్రుడు, సిబ్బంది శంకరావు, రమణమ్మ, దేవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ వైస్ ఎంపీపీ మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

మాకవరపాలెం: వైఎస్సార్‌సీపీ నేత, మాజీ వైస్ ఎంపీపీ చింతకాయల శ్రీనివాసరావు(50)మృతి చెందారు. ఆయన గత కొన్ని రోజులుగా గుండె సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించడంతో రెండు రోజుల కిందట విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పి, చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున శ్రీనివాసరావు మృతి చెందారు. ఆయన అకాల మరణానికి నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్, ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నేతలు సంతాపం తెలిపారు.

నేడు 500 మీటర్ల జాతీయ జెండా ఊరేగింపు

దేవరాపల్లి: స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మండల కేంద్రం దేవరాపల్లిలో బుధవారం 500 మీటర్ల పొడవైన జాతీయ జెండా ఊరేగింపు ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుపోలు శ్రీను మంగళవారం తెలిపారు. దేశ భక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వ హైస్కూల్ నుంచి ప్రారంభమై నాలుగు రోడ్ల కూడలి మీదుగా సినిమా థియేటర్ వరకు ఊరేగింపు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కె.కోటపాడు సీఐ బి.స్వామినాయుడు, ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ, తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్.అప్పలరాజు, ఎంఈవోలు పడాల్‌దాస్, వి.ఉషారాణిలను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' సెల్ఫీ



తూటిపాలలో జాతీయ జెండాలతో సెల్ఫీ దిగుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: మండలంలోని తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 13 నుంచి 15 వరకు పాఠశాలలు, కార్యాలయాల్లో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టాలన్న ప్రధాని మోదీ సూచనతో మంగళవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ జెండాలతో సెల్ఫీలు దిగారు.

నర్సీపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హర్ ఘర్ తిరంగా పేరిట జాతీయ పతాకాలను చేతబూని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈవో చీడిపల్లి తలుపులు ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలు విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందిస్తాయన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న గోపీనాథ్

నర్సీపట్నం: ఇండిపెండెన్స్ డేను పురస్కరించుకుని డినెట్ స్పోర్ట్స్ గ్రౌండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు మంగళవారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపీనాథ్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 12 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో మాంటిసోరి, నలంద జట్లు తలపడగా మోంటిసోరీ స్కూల్ విద్యార్థులు విజేతగా నిలిచారు.

'నివాసాలు, వ్యాపార కేంద్రాలపై జెండా ఎగరాలి'



బీజేపీ మండల నాయకులతో చోడవరం ఇన్‌చార్జి రమణమూర్తి

రోలుగుంట: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న నివాసాలు, వ్యాపార కేంద్రాలపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాల్సిందిగా బీజేపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి కె.రమణమూర్తి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ మండల కార్యవర్గంతో మండలశాఖ అధ్యక్షుడు కర్రి తమ్మునాయడు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న రమణమూర్తి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఓ పండగలా నిర్వహించి, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించేలా చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి దూది రాజేష్, మండల కార్యదర్శి మామిడి రమణ, మాజీ ఉపకార్యదర్శి తమరాన పెదిరెడ్డి వెంకటరమణ, మద్దు నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు

తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌ను కలిసిన పార్టీ నాయకులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జెడ్పీటీసీ, మండల నాయకులు



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో సర్పంచ్ దొరబాబు

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ జెండా మోసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం దక్కుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధల ఆధ్వర్యంలో మాడుగుల నియోజకవర్గానికి చెందిన ఎంపీపీ, జెడ్పీటీసీ, పలు గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు మాజీ సీఎం జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టతకు నేతలంతా ఐక్యతతో ముందుకు సాగాలని ఆయన సూచించినట్లు ఎంపీపీతెలిపారు. జగన్‌ను కలిసిన వారిలో కె.కోటపాడు మండలం వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, ఎంపీటీసీలు ఏటుకూరి రాజేష్, గొర్రుపోటు రామలక్ష్మి, బంగారి లక్ష్మి, రొంగలి లక్ష్మి, లెక్కల గౌతమి, చీపురపల్లి అచ్చిబాబు, నెక్కల గోపి, వర్రి రామునాయుడు, పల్లా కన్నమ్మ, మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, సర్పంచ్‌లు బండారు దేముళ్లు, వేచలపు దొరబాబు, వంటాకు అప్పాజీ, లెక్కల దేముడునాయుడు, రొంగలి వెంకటరమణ, నారపాటి శ్రీరామ్మూర్తి, గంతకర్ల సతీష్, ద్వారపూడి శ్రీను, ఆకుల సాయిప్రసాద్, చల్లా సురేష్, వంటాకు గోవిందరావు తదితరులున్నారు.

బుచ్చెయ్యపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కలిసి, మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, జిల్లా ప్రచార కార్యదర్శి జోగా కొండబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు గోకివాడ రాము, కోరుకొండ రమణ, ముచ్చకర్ల అప్పారావు, గుడాల ఆనంద్, గుద్దేటి శ్రీను, సుంకరి గాంధీ, పాతాళ సత్తిబాబు, చరణ్ తదితరులు జగన్‌ను కలిసి మండల సమస్యలు, సంక్షేమ పథకాల నిలిపివేత, టీడీపీ నాయకుల ఆరాచాకాలపై విన్నవించారు.

అసంపూర్తిగా నిలిచిన సామాజిక భవనం



యడ్లవానిపాలెంలో అర్ధంతరంగా నిలిచిన సామాజిక భవన నిర్మాణం

కె.కోటపాడు: వారాడ శివారు యడ్లవానిపాలెంలో 17 ఏళ్లుగా సామాజిక భవనం నిర్మాణం పూర్తికాక అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ఈ కమ్యూనిటీ భవన నిర్మాణ పనుల్ని 2007లో ప్రారంభించారు. అప్పుడు మంజూరైన నిధులతో శ్లాబ్ వరకు పనులు చేపట్టారు. ఆ తర్వాత నిధుల్లేవని సదరు కాంట్రాక్టర్ పనుల్ని మధ్యలోనే నిలిపేశారు. అప్పటి నుంచీ ఈ నిర్మాణం పూర్తికాని పరిస్థితి. దీంతో స్థానికులు దీన్ని శిథిలమైన ఎడ్ల బళ్లు, కర్రలు తదితర పనికిరాని సామగ్రికి ఆలవాలంగా మార్చేశారు. గ్రామంలో పండగలు, ప్రత్యేక సందర్భాల్లో సభలు, సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు సరైన వేదిక లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా దీనికి నిధులు మంజూరు చేసి, నిర్మాణాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వారాడలో ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య సేవలు అందిస్తున్న వైద్యాధికారి సాయికిరణ్

కె.కోటపాడు: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు వ్యాధుల బారిన పడే పరిస్థితులు ఎక్కువగా ఉంటాయని, ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.సాయికిరణ్ తెలిపారు. వారాడలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా 133 మందికి సాధారణ వైద్య పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలను నిర్వహించారు. అవసరమైన మందుల్ని ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా, పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ సుమ, ఏఎన్ఎం సూర్యకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధనతోపాటు, సమయపాలన తప్పనిసరి



ఉపాధ్యాయులతో ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ

నాతవరం: ఉపాధ్యాయులు సమయపాలనతో పాటు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంఈవో సత్యనారాయణ సూచించారు. మంగళవారం ఆయన గునుపూడి హైస్కూల్లో ఈ ప్రాంతంలోని ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ విధిగా అమలు చేయాలన్నారు. మండలానికి ఈ ప్రాంత పాఠశాలలు మారుమూలన ఉండటంతో ఉపాధ్యాయులంతా విధిగా సమయపాలన పాటించాలన్నారు. హైస్కూల్‌లో ప్రధాన సమస్యలను హెచ్‌ఎం టి.శివజ్యోతిని అడిగి తెలుసుకున్నారు. ఎంఈవో తొలిసారిగా ఈ ప్రాంతానికి రావడంతో హెచ్‌ఎం శివజ్యోతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు సీఆర్పీ పోలుపర్తి నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వర్షం.. రైతుల హర్షం



రోలుగుంటలో కురుస్తున్న వర్షం

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం కురిసిన వర్షం రైతులకు ఊరటనిచ్చింది. గత నెలలో కురిసిన వర్షాలకు పంట భూముల్లో చేరిన నీటితో పల్లపు భూముల్లో దమ్ములు ముగించుకున్నారు. సమీప చెరువులు, కాలువల్లో నీటిని యంత్రాల సాయంతో భూముల్లోకి చేర్చి కొమరవోలు, శరభవరం, రోలుగుంట, లగుడు కొత్తూరు తదితర గ్రామాల్లో నాట్లు వేసుకున్నారు. జేపీ అగ్రహారం, వెలంకాయలపాలెం, కొంతలం తదతర మెట్ట ప్రాంతాల్లో మాత్రం నీరు చాలినంత లేక, నారు ఉన్నా దమ్ములు జరగలేదు. నాట్లు పడలేదు. కొందరు నీటి ఇంజిన్లతో సాగు పనులు జరిపినా, చాలా ప్రాంతాల్లో పదును లేక నాట్లు వేయలేదు. ఇలాంటి తరుణంలో కురిసిన వర్షం పంట చేలకు ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.